క్లుప్తంగా

ప్రతిభావంతులకు నగదు పురస్కారాలు



గుంటూరు ఎడ్యుకేషన్: నగరంపాలెంలోని ప్రజ్ఞ పాఠశాలలో శుక్రవారం వార్షిక ప్రతిభా పురస్కారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎన్. చక్రనాగ్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలకు పైగా పేద, వెనుకబడిన ప్రాంతాల్లోని విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తూ, నామమాత్రపు ఫీజులతో నాణ్యమైన బోధన అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు క్రీడలకు తగిన ప్రాధాన్యమిస్తూ ప్రతిభా పాటవ పోటీల్లో ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు అత్యుత్తమ బోధన అందిస్తూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత చదువుల్లో రాణించే విధంగా కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యా సంవత్సరంలో అత్యధిక హాజరు కలిగిన విద్యార్థులతో పాటు ఉత్తమ ఆంగ్ల భాషా పరిజ్ఞానం, రెగ్యులర్‌గా యూనిఫాంలో హాజరైన వారికి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎస్.కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ అరుణసుధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ కూలర్, కంప్యూటర్ బహూకరణ



కొరిటిపాడు: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయం గుంటూరు వారి సౌజన్యంతో శుక్రవారం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వాటర్ కూలర్, కంప్యూటర్ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జ్ఞాన ప్రసూన బ్యాంక్ మానవతా దృక్పథాన్ని ప్రశంసిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. రీజినల్ హెడ్ సయ్యద్ జవహర్ విద్యార్థుల్లో పొదుపు అలవాటును పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. బ్యాంకు ఖాతా తెరచిన విద్యార్థులను అభినందించారు. బ్యాంక్ అధికారులు తమ ప్రముఖ పథకం 'యూనియన్ ముస్కాన్' గురించి వివరించారు. ఇది 18 సంవత్సరాలలోపు పిల్లల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు బ్యాంక్ అధికారులు పొదుపు ఖాతాల పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ రీజినల్ హెడ్ ఎ. రాజేశ్, చీఫ్ మేనేజర్ శ్రీనివాస కుమార్ హరి, సీనియర్ మేనేజర్ హారిక హాజరయ్యారు.

ముఠా కార్మికులకు పని భద్రత కల్పించాలి



లక్ష్మీపురం: ఐరన్ షాపుల్లో పని చేస్తున్న ముఠా కార్మికులకు పని భద్రత కల్పించి, కూలి రేట్లు పెంచాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. కార్మికుల చేపట్టిన సమ్మె శుక్రవారంతో నాలుగో రోజుకు చేరిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు. గత అనేక సంవత్సరాలుగా ఐరన్ షాపుల్లో పని చేస్తూ ఎండనక వాననక నిత్యం శ్రమ చేస్తున్న ముఠా కార్మికుల అగ్రిమెంట్ కాల పరిమితి ముగిసిందని తెలిపారు. నూతన అగ్రిమెంటు చేయడంలో యాజమాన్యం మొండి వైఖరి విడనాడాలని, లేనిపక్షంలో కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. దేశంలో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుకూలంగా కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, ఐరన్ ముఠా మేస్త్రిలు పప్పుల రోసిరెడ్డి, కొంగలి కోటయ్య, బిచ్చాల కొండ, ఉప్పలపాటి శ్రీను, సత్యం, ఖాజావలి, శ్రీహరి, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

ఆటోలకు నంబర్లు కేటాయింపు



పట్నంబజారు: ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నగరంలో ఆటోలకు నంబర్లు కేటాయిస్తున్నారు. ఈస్ట్ ట్రాఫిక్ స్టేషన్, వెస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు సుమారు ఐదు వేల ఆటోలకు నంబర్లు కేటాయించారు. మరింత త్వరగా పూర్తి చేయాలనే ఉద్దేశంతో ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం పేరేచర్ల బస్టాండ్ వద్ద నంబర్ల కేటాయింపు కార్యక్రమం చేపట్టారు. సుమారు వందకు పైగా ఆటోలకు ఒక్కరోజులోనే కేటాయించారు. ఈస్ట్ ట్రాఫిక్ ఎస్ఐ రవీంద్ర, సిబ్బంది పర్యవేక్షించారు.

షాడో కార్పొరేటర్ బూతు పురాణం

- ఉపాధి రుణాలకు దరఖాస్తుల పరిశీలనలో ఘటన
- చెప్పిన పని చేయవా అంటూ సెక్రటరీపై విరుచుకుపడిన పచ్చ నేత
- వెల్ఫేర్ సెక్రటరీ కాలర్ పట్టుకున్న వైనం
- కొద్ది సేపు విధులు నిర్వహించకుండా బయటకు వచ్చేసిన ఉద్యోగులు
- ఉపా సెల్ పీఓ సర్దిచెప్పడంతో సద్దుమణిగిన పరిస్థితి



అధికారులతో కలిసి స్టేజ మీద కూర్చున్న షాడో కార్పొరేటర్ శ్రీను

నెహ్రూనగర్: నేను టీడీపీ కార్పొరేటర్ భర్తను.. నేను చెప్పిన పనిని చేయకుండా ఇక్కడ నుంచి వెళ్తావా..నువ్వు నన్ను ఏం పీకలేవు !'' అంటూ వార్డ్ వెల్ఫేర్ సెక్రటరీపై టీడీపీ షాడో కార్పొరేటర్ దౌర్జన్యానికి దిగాడు. పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి శుక్రవారం బీసీ కార్పొరేషన్ సబ్సిడీ లోన్లు మంజూరుకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన ఎన్టీఆర్ స్టేడియంలో జరిగింది. ఈ క్రమంలో వేలాది మంది నుంచి వచ్చిన దరఖాస్తులను వార్డు వెల్ఫేర్ సెక్రటరీలు పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో 38వ డివిజన్ కార్పొరేటర్ పద్మశ్రీ భర్త శ్రీను వెనకాల నుంచి దరఖాస్తులను తీసుకోవాలంటూ రుబాబు చేశాడు. ముందు చాలా మంది దరఖాస్తుదారులున్నారు.. కొంత సేపు ఆగిన తరువాత తీసుకుంటానని వార్డు వెల్ఫేర్ సెక్రటరీ సమాధానం చెప్పడంతో కోపంతో ఊగిపోయాడు. కార్పొరేటర్ భర్త '' నన్నే ఆగమంటావా..నువ్వు ఉద్యోగం ఎట్లా చేస్తావో చూస్తాను.. స్టేడియం నుంచి బయటకు పోలేవు'' అంటూ బూతు పురాణం లంకించుకున్నాడు. దీంతో తోటి ఉద్యోగులంతా ఏకమయ్యారు. బూతులు తిడితే సహించేది లేదంటూ విధులు బహిష్కరించేందుకు బయటకు వెళుతున్న క్రమంలో అక్కడే ఉన్న ఉపా సెల్ పీఓ రామారావు ఉద్యోగులకు సర్ది చెప్పి తిరిగి విధుల్లోకి పంపించారు.

2548 దరఖాస్తులకు 1418 మాత్రమే పరిశీలన

పశ్చిమ నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న 2548 మందిలో శుక్రవారం ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన పరిశీలన క్యాంప్‌కి 1418 మంది హాజరయ్యారు. కమిషనర్ ఆదేశాల మేరకు డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ఉపా సెల్ పీవో రామారావుతో పాటు క్యాంప్‌కి హాజరైన వారి దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు పరిశీలించారు. ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించి 7న అమరావతి రోడ్డులోని నవీన స్కూల్ వద్ద శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులంతా హాజరుకావాలని అధికారులు సూచించారు.

ప్రజలకు నిబద్ధతతో సేవ చేయాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి



మాట్లాడుతున్న పార్థసారథి

గుంటూరు లీగల్: ప్రజలకు నిబద్ధతతో సేవ చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శుక్రవారం పారా లీగల్ వలంటీర్స్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పారా లీగల్ వలంటీర్స్‌గా ఎంపికైన వారికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రౌండ్ లెవెల్‌లో ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు వారికి న్యాయ సహాయం అందించాలని సూచించారు. వ్యక్తిగత అవసరాలకు, ఇతరులను ఇబ్బంది పెట్టడానికి పదవిని ఉపయోగించరాదని చెప్పారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా న్యాయం పొందే విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ పి.వి.రాంబాబు నల్సా పథకాలు, పారా లీగల్ వలంటీర్స్ విధుల గురించి వారికి వివరించారు. ప్యానెల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు సివిల్ చట్టాలపై, పారా లీగల్ వలంటీర్స్ ప్రాముఖ్యతను వివరించారు. డెప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఐ. మధుబాబు క్రిమినల్ యాక్ట్ గురించి తెలియజేశారు. సీనియర్ పారా లీగల్ వలంటీర్స్ షేక్ మహమ్మద్ రఫీ, టి. మంగయ్య సలహాలు, సూచనలు అందించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ మాట్లాడుతూ ప్రజలకు న్యాయ సహాయం అందించేలా కృషి చేయాలని తెలిపారు.

జ్యోతిరావు పూలే స్మృతి వనం ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేసన శంకరరావు

నెహ్రూనగర్: గత ప్రభుత్వం విజయవాడ నడిబొడ్డులో అంబేడ్కర్ స్మృతి వనం ఏర్పాటు చేసినట్లుగా అమరావతి రాజధానిలో మహాత్మా జ్యోతిరావు పూలే స్మృతి వనం ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం అమలుతో పాటు చట్ట సభల్లో 34శాతం రిజర్వేషన్లు సక్రమంగా అమలు జరిగేందుకు కుల జనగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో బీసీలంతా ఏకమై మద్దతు తెలపడం వల్లనే అత్యధిక మెజార్టీతో కూటమి ప్రభుత్వం గెలుపొందిందని పేర్కొన్నారు. కూటమి గెలుపులో కీలకమైన బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ బీసీల హక్కుల పరిరక్షణలో ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో బీసీలంతా ఏకమై కూటమిని గెలిపించుకున్నారని, వారి అభివృద్ధికి ప్రభుత్వం దోహదపడాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ నాయకులంతా కలిసి కేసన శంకరరావుకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు కన్నా మాస్టారు, కనకరావు, ఉప్పాల శివలక్ష్మి, కోలా అశోక్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

'సోమేపల్లి' జీవితం ఆదర్శనీయం



విజయలక్ష్మిని సత్కరిస్తున్న కాసింబీ, సుభాని, రాజేంద్రప్రసాద్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజ హితం కోసం పాటుపడిన సోమేపల్లి వెంకట సుబ్బయ్య జీవితం వర్తమాన, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా రచయితల సంఘ ఉపాధ్యక్షురాలు, రచయిత్రి షేక్ కాసింబీ పేర్కొన్నారు. ప్రజా ఆలోచన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం సోమేపల్లి ప్రథమ వర్ధంతి సభను విజయపురికాలనీలోని ఆయన నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బయ్య మరణానంతరం నేత్రాలు శంకర నేత్రాలయానికి, పార్థివదేహాన్ని గుంటూరు మెడికల్ కళాశాలకు అందించిన నేపథ్యంలో ఆయన సతీమణి విజయలక్ష్మిని సత్కరించారు. ఈ సందర్భంగా కాసింబీ మాట్లాడుతూ వెంకట సుబ్బయ్య ఆర్డీవోగా, పులిచింతల ప్రాజెక్టు అధికారిగా నిలువెత్తు నిజాయతీకి నిదర్శనంగా పని చేశారని తెలిపారు. జిల్లా రచయితల సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం సుభాని మాట్లాడుతూ రక్తదానానికి మనుషులు లోటు అని, రక్త దాహానికైతే కోటానుకోట్ల మంది అని సోమేపల్లి ఆవేదనగా చెప్పేవారని గుర్తు చేశారు. అవయవ, దేహ దాన ప్రచారోద్యమ నాయకుడు వల్లూరి సదాశివరావు మాట్లాడుతూ ఆగస్టు 13ను జాతీయ అవయవ దాన దినోత్సవంగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం, 2025 సంవత్సరాన్ని 'రైజింగ్ అవేర్నెస్ అండ్ ఎంకరేజింగ్ ఆర్గాన్ డొనేషన్'గా నిర్ణయించిందని చెప్పారు. కార్యక్రమంలో ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షుడు మేడూరి రాజేంద్రప్రసాద్, చావా శివాజీ, తోటకూర సౌభాగ్యమ్మ, మానుకొండ పద్మావతి, సోమేపల్లి శ్రీవశిష్ట, జి. గురవయ్య, రాధాకృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో వసంత నవరాత్రుల సందర్భంగా సప్తమి శుక్రవారం చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొమ్మిది మంది వేద పండితుల ఆధ్వర్యంలో బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్ర, లక్ష్మీ గణపతి, చండీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓలా, ఉబర్ క్యాబ్ డ్రైవర్ల పోరాటానికి మద్దతు

లక్ష్మీపురం: గుంటూరు, విజయవాడల్లో ఓలా, ఉబర్ సర్వీసులను నిలిపివేస్తూ పోరుబాట పట్టిన క్యాబ్ డ్రైవర్లకు ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు బి. లక్ష్మణరావు, రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ తెలిపారు. పాత గుంటూరు సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. క్యాబ్ డ్రైవర్లను ఓలా, ఉబర్ నిలువుగా దోచుకు తింటున్నాయని తెలిపారు. 30శాతం కమిషన్ల పేరిట యాప్ ఉపయోగానికి ప్రతి రోజు డబ్బు చెల్లించాలని నిబంధన చేర్చి డ్రైవర్ల జేబులు ఖాళీ చేస్తోందని ఆరోపించారు. ఒక బుకింగ్‌ను ఐదుగురు డ్రైవర్లకు ఇవ్వడంతో పాటు రోజూ రీచార్జ్ చేయించడం, నిరంతరం ఫోన్‌పై ఆధారపడి అదే పనిగా ఉండటంతో డ్రైవర్ల మానసిక ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. డ్రైవర్ల శ్రమను ఓలా, ఉబర్ సంస్థలు దోచుకుంటున్నాయని, గుంటూరు- విజయవాడ మధ్యలో టోల్‌గేట్ రుసుం పెంచడంతో మరింత భారం అయిందని పేర్కొన్నారు. ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ పోరాట ఫలితంగా పార్లమెంట్‌లో ప్రభుత్వం యాప్‌ని తీసుకురావడానికి అంగీకరించడం మంచి పరిణామం అని తెలిపారు. ఓలా, ఉబర్ క్యాబ్ డ్రైవర్ల న్యాయమైన పోరాటానికి సంపూర్ణ మద్దతుతో పాటు ప్రత్యక్ష కార్యాచరణకు తో ఫెడరేషన్ సిద్ధమవుతుందని తెలిపారు. తక్షణమే క్యాబ్ డ్రైవర్ల సమస్య పరిష్కార దిశగా ఓలా, ఉబర్ సంస్థలు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

నృసింహుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీ రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అంకురార్పణ, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచన, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, మంగళాశాసనం నిర్వహించారు. నగర పరిసరాల్లోని భక్తులు పెద్దసంఖ్యలో హాజరై, ప్రారంభ బ్రహ్మోత్సవాలను తిలకించారు. స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈనెల 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఈఓ ఎస్. ఆంజనేయాచార్యులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న నక్కా వెంకటేశ్వర్లు, మనోహర్‌కుమార్, రాజశేఖర్‌రావు, కళాధర్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాలకుల విధానాల ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమేణా తగ్గుముఖం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలో బడి ఈడు కలిగిన 49 శాతం మంది పిల్లలు ప్రభుత్వ బడుల్లో ఉండగా, ప్రైవేటు పాఠశాలల్లో 51 శాతానికి చేరడం ప్రభుత్వ విద్యారంగానికి ప్రమాద ఘంటికలని ఆయన పేర్కొన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్ కుమార్ మాట్లాడుతూ పిల్లలందరికీ నాణ్యమైన విద్య, సామర్థ్య ఆధారిత బోధన ఇస్తామనే భరోసాని, నమ్మకాన్ని తల్లిదండ్రులకు కలిగించాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ పాలకుల ప్రైవేటీకరణ విధానాలను ప్రతిఘటిస్తూనే ప్రభుత్వ బడులని రక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్ రావు, ఎం.కళాధర్, జిల్లా సహాధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు, వై. నాగమణి, జిల్లా కార్యదర్శులు సీహెచ్. ఆదినారాయణ, ఎం.గోవిందు, ఎండీ. షకీలాబేగం, బి.ప్రసాద్, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం. కోటిరెడ్డి, ఎం.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

అలరించిన భక్తి గీతాలాపన



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై శుక్రవారం సాయంత్రం మధురవళి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో భక్తి గీతాలాపన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ సంగీత విద్వాంసురాలు రాధామైథిలి శిష్య బృందం కృష్ణ చంద్రిక, వరలక్ష్మి, సుజాత, తన్వీశ్రీ తమ గాత్రధారణలో పలు అన్నమయ్య సంకీర్తనలు, భక్తి గీతాలను ఆలపించారు. ప్రేక్షకులను అలరించాయి. కీబోర్డుపై జి.సాయి, తబలపై పి.వి.రమణ వాయిద్య సహకారాన్ని అందించారు.

రిజర్వాయర్‌లను శుభ్రంగా ఉంచాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



డ్రెయిన్‌లో పూడికతీతను పరిశీలిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి రిజర్వాయర్‌ని నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం నాజ్ సెంటర్‌లోని ఎల్ఎల్ఆర్ రిజర్వాయర్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఎల్ఆర్ కాలనీ, నల్ల చెరువు, చంద్రమౌళీనగర్, రాజేంద్ర నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోని ప్రతి రిజర్వాయర్‌ని నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేయాలని ఆదేశించారు. ఎమినిటీ కార్యదర్శులు తప్పనిసరిగా తాగు నీటి సమయంలో క్లోరిన్ శ్యాంపిల్స్ సేకరించాలని చెప్పారు. ఎక్కడైనా కలుషిత నీటి సరఫరాని గుర్తిస్తే తక్షణం ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి సమస్య పరిష్కారం చేయాలని ఆదేశించారు. పైప్‌లైన్ లీకులను ఎప్పటికప్పుడు మరమ్మతు చేయించాలని, తాగు నీటి సరఫరాలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మధ్యాహ్నం పారిశుద్ధ్య కార్మికులు డ్రెయిన్లు శుభ్రం చేయడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. కార్మికుల పనితీరుని పర్యవేక్షణ చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఎస్‌లను కమిషనర్ ఆదేశించారు. ప్రధాన ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్స్ లేకుండా నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ చేయాలని చెప్పారు. వ్యాపార సంస్థలు వ్యర్థాలను రోడ్ల మీద వేయకుండా నోటీసులు ఇవ్వాలని తెలిపారు. ఆయన వెంట ఏసీపీ రెహ్మాన్, డీఈఈ రమేష్ బాబు, టీపీఎస్‌లు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపుపై రాయితీ

నెహ్రూనగర్: 2025–26 ఆర్థిక సంవత్సరానికి గానూ ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి రాయితీని వినియోగించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్సీగా లక్ష్మణరావు కృషి శ్లాఘనీయం



లక్ష్మణరావును సన్మానిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: నిత్యం ప్రజా సమస్యలపై పోరాడి అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందిన కె.ఎస్.లక్ష్మణరావు అరుదైన ప్రజాప్రతినిధిగా నిలిచిపోయారని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని కార్యాలయంలో శుక్రవారం లక్ష్మణరావు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ చర్చా వేదిక కన్వీనర్ అవధానుల హరి మాట్లాడుతూ రాజ్యాంగ లక్ష్యాలకు కట్టుబడి నిజాయితీ, నిబద్ధతతో 14 ఏళ్లపాటు ఎమ్మెల్సీగా లక్ష్మణరావు కృషి మరువలేనిదని కొనియాడారు. సాహితీవేత్త సీహెచ్.సుశీల మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి శాసనమండలిలోనూ, బయట చిత్తశుద్ధితో కృషి చేసిన లక్ష్మణరావు అన్ని వర్గాల ప్రజలకు ఆప్తుడిగా నిలిచారని పేర్కొన్నారు. ప్రోగ్రెసివ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.హనుమంతరెడ్డి మాట్లాడుతూ లక్ష్మణరావు గెలిచినా, ఓడినా ఎప్పుడూ ప్రజల మనిషిగానే ఉంటారన్నారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివామిరెడ్డి మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన లక్ష్మణరావు ప్రజాప్రతినిధులందరికీ ఆదర్శప్రాయులని కొనియాడారు. అనంతరం ఆయన్ను ఘనంగా సత్కరించారు.

కోవిడ్‌లో ప్రజల ప్రాణాలకు జగన్ రక్ష

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచాన్ని గడగడ లాడించిన కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ప్రాణాలను కాపాడారని విజయవాడకు చెందిన డాక్టర్ బూదాల విజయకుమార్ పేర్కొన్నారు. గుంటూరుకు చెందిన అవర్ స్టేట్ అవర్ లీడర్, ఇండియన్ ఇంటిలెక్చ్యువల్ ఫోరం అధ్యక్షుడు జి. శాంతమూర్తి ఆధ్వర్యంలో కోపల్లి జయకర్‌బాబు అనుసంధానకర్తగా 'లాక్‌డౌన్ జ్ఞాపకాలు–నేర్పిన పాఠాలు' అనే అంశంపై శుక్రవారం వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రూప్ సభ్యుల్లో ఒకరైన డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ పేదలు, ధనికులు అనే భేదం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడం ద్వారా సమ న్యాయం చేసిన వైఎస్. జగన్ పాలన అత్యున్నత ప్రమాణాలకు రుజువు అన్నారు. తిరుపతి నుంచి కాపిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆపత్కాలంలో అచంచలమైన ఆత్మవిశ్వాసంతో జగన్ అత్యుత్తమమైన పాలన అందించారని కొనియాడారు. బెంగుళూరుకు చెందిన సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కోవిడ్ అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచి, కరోనాను నియంత్రించడంలో ఆయన సఫలీకృతులయ్యారని పేర్కొన్నారు. గుంటూరుకు చెందిన సంగిరెడ్డి హనుమంతరెడ్డి మాట్లాడుతూ కరోనా క్లిష్ట పరిస్థితులను పునఃపరిశీలన చేసుకుని, మానవతా విలువలను బలోపేతం చేసుకోవాలని తెలిపారు. విస్సన్నపేట నుంచి కోపల్లి జయకర్ మాట్లాడుతూ కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రజలను కంటికి రెప్పలా కాపాడటం వైఎస్. జగన్‌కే సాధ్యపడిందని పేర్కొన్నారు. వెబినార్ నిర్వాహకుడు జి. శాంతమూర్తి మాట్లాడుతూ కరోనా కాలంలో జగన్ సుపరిపాలన అందించారని, వేలాది మందిని కరోనా బారి నుంచి కాపాడారని కొనియాడారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

పట్నంబజార్ : గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శుక్రవారం ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ), ఎంఎంయూఏ ఆధ్వర్యంలో యాజమాన్య విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి, పెద్దఎత్తున నిరసన తెలియజేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతి సంవత్సరం డిజిటల్ చార్ట్‌లను పూరించే ప్రక్రియలో భాగంగా జిల్లా యాజమాన్యం అన్ని అసోసియేషన్‌లతో చర్చలు జరిపింది. ఎప్పటిలాగే రొటేషన్ పద్ధతిలో డిజిటల్ చార్ట్ పూరించాలని ఆర్టీసీ ఉద్యోగులు కోరారు. అయితే, యాజమాన్యం ఉద్యోగుల నిర్ణయాన్ని వ్యతిరేకించింది. ఏకపక్షంగా ఫిక్స్‌డ్ డ్యూటీలను పూరిస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ ఉద్యోగులు శుక్రవారం ఈయూ, ఎంఎంయూఏ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో జేఏసీగా ఏర్పడి, యాజమాన్యం నిర్ణయంపై నిరసన వ్యక్తం చేశారు. ఉదయం 4 గంటల నుంచి ఎర్ర బ్యాడ్జీలతో మధ్యాహ్నం 12 గంటల వరకు నిరసన తెలియజేసి, గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు షేక్ కరీముల్లా, ఎండీ.ఖాశీం సాహెబ్, జి.ప్రకాశరావు, షేక్ ఎం.వలి, ప్రకాష్, ఎస్.ఎస్.రెడ్డి, బి.శంకరరావు, చిన్నబ్బాయి, ఏఆర్‌బీ రెడ్డి, వజీర్ పాల్గొన్నారు.

రేపు శ్రీరామనవమి శోభాయాత్ర



గుంటూరు మెడికల్: నగరంలో ఆదివారం ఉదయం శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ఉత్సవ సమితి సభ్యులు వెల్లడించారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు కారంశెట్టి లోకేష్ గుప్తా మాట్లాడుతూ గత ఏడు ఏళ్లుగా నగరంలో శ్రీరాముల వారి శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గుంటూరులోని హిందూ దేవాలయాలను కలుపుకుంటూ ఆదివారం ఉదయం 9:11 గంటలకు బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వర దేవస్థానం నుంచి ప్రారంభమయ్యే రథయాత్ర నగరంలోని ప్రధాన దేవాలయాలు మీదుగా సాగుతుందని తెలిపారు. చివరిగా రామనామ క్షేత్రంలో ముగుస్తుందని వెల్లడించారు. నగరంలోని రామభక్తులందరూ పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. ఉత్సవ సమితి సభ్యులు తియ్యు వేణుగోపాల్, చల్లా బ్రహ్మారెడ్డి, అడపా ఫణీంద్ర, సాయి, ప్రవీణ్, శ్రీనివాస్, లక్ష్మీ రామానుజ దాసి, జానకీరామ్, రామరాజు, సంజీవ్ పాల్గొన్నారు.